## క్లుప్తంగా

### ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

ఎల్కతుర్తి : కంటి చూపు మందగించడంతో ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించగా ఆపరేషన్ చేస్తే చూపు వస్తుందో..? రాదోనని భయాందోళనకు గురైన ఓ వ్యక్తి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని సూరారంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం గ్రామానికి చెందిన గుగులోతు దేవయ్య(55)కు కంటి చూపు మందిగించడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి రెండు కళ్లకు ఆపరేషన్ చేయాలని చెప్పారు. అయితే ఆపరేషన్ చేసినా చూపు వస్తదో రాదోనని భయాందోళన చెందిన దేవయ్య.. ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య కమలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మృతుడికి కుమారుడు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

### యువకుడిపై పోక్సో కేసు

ధర్మసాగర్ : స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం పోక్సో కేసు నమోదు అయ్యింది. సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ మహిళ ఫిర్యాదు ప్రకారం.. తన కూతురైన మైనర్ బాలికను స్టేషన్ ఘన్‌పూర్ మండలం మీదికొండ గ్రామానికి చెందిన జోగు ప్రవీణ్ ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి శారీరకంగా లొంగదీసుకున్నడని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆ వ్యక్తిపై చట్టపరంగా చర్య తీసుకోవాలని ఫిర్యాదులో కోరినట్లు తెలిపారు. దీంతో యువకుడిపై పోక్సో, అత్యాచార సెక్షన్లలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

### వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



ధర్మసాగర్ : తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర 2వ మహాసభను జయప్రదం చేయాలని టీఎంజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొల్లెపాక రాజేష్, మండల ఇన్‌చార్జ్ ప్రసద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలో సీఐ ప్రవీణ్‌కుమార్ చేతుల మీదుగా వాల్‌పోస్టర్ ఆవిష్కరింపజేశారు. ఈ కార్యక్రమంలో ఎంజేఎఫ్ మండల ఇన్‌చార్జ్ ప్రసాద్, సీనియర్ జర్నలిస్టులు పృథ్వీరాజ్, మాధ్యూ, రణధీర్, స్టీఫెన్, చిట్యాల రమేశ్, అనిల్, షరీఫ్ పాల్గొన్నారు.

**ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో..**



నర్సంపేట : డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రవేశాల వాల్‌పోస్టర్లను స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లం నవీన్ సోమవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఓసీ, బీసీ, ఇతర సామాజికవర్గాలకు చెందిన విద్యార్థులకు ఫీజు రూ.3200 ఉండగా గిరిజనులకు కేవలం రూ.500లకే ప్రవేశం కల్పించేలా వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ గంట చక్రపాణి నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. మొదటి సంవత్సర ప్రవేశానికి రెగ్యూలర్/ఓపెన్ ఇంటర్, ఐటీఐ, డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులు అర్హులని చెప్పారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఈనెల 13లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాల కోసం సెల్ నంబర్ 7382929577లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో కార్యాలయ ఉద్యోగులు నరేష్, శివ, కౌన్సిలర్ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### 19న పెన్షనర్ల సన్నాహక సదస్సు

**ఎంఎస్‌పీ ఏపీ అధ్యక్షుడు విశ్వనాథ్**

వర్ధన్నపేట : సెప్టెంబర్ 3వ తేదీన హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో పెన్షనర్ల మహాగర్జన విజయవంతం కోసం ఈనెల 19న వర్ధన్నపేటలో పెన్షనర్ల సన్నాహక సదస్సు నిర్వహిస్తామని ఎంఎస్‌పీ ఏపీ అధ్యక్షుడు విశ్వనాథ్ కోరారు. పట్టణంలో సోమవారం నిర్వహించిన ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ అనుబంధ సంఘాల నాయకుల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, బీడీ, ఇతర రంగాల కార్మికుల పెన్షన్ పెంచుతామని హామీ ఇచ్చి ఓట్లు దండుకుని గద్దెనెక్కి 20 నెలలు గడచినా పట్టించుకోవడం లేదన్నారు. పెన్షనర్ల సమస్యల పరిష్కార దిశగా ఉద్యమాలు తప్పవని చెప్పారు. సదస్సుకు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి పెన్షనర్లు తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకులు కందుకూరి సోమన్న, ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్, ఎంఎస్‌పీ జిల్లా అధికార ప్రతినిధి మాసాని గోపాల్, నాయకులు గోలి సుధాకర్, ఐత రాజు, ముత్యాల మల్లేశ్, వశపాక కుమార్, సీనపెల్లి రాజు, చాడ కరుణాకర్, దయ్యాల యాకయ్యతో పాటు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పట్టణవాసులూ.. పట్టింపులేదా..?



రాజీపేట కాలనీలో ఒకే ఇంటిలో అమర్చిన మూడు నల్లా కనెక్షన్లు



మసీదు రోడ్డులో వృథాగా పారుతున్న తాగునీరు

- గేట్‌వాల్వ్ తొలగించి వదిలేయడంతో వృథాగా పోతున్న తాగునీరు
- మరోవైపు నీటి కొరతతో విద్యార్థినుల ఇబ్బందులు
- ప్రేక్షక పాత్రలో మున్సిపల్ సిబ్బంది

పరకాల : ఓ వైపు తాగునీరు లేక కొందరు తహతహలాడుతుంటే మరికొందరు మిషన్ భగీరథ నల్లాల గేట్‌వాల్వ్‌ను తొలిగించి వదిలేయడంతో నీరు వృథాగా పారుతుంది. పరకాల మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వం రూ.43కోట్ల నిధులు వెచ్చించి నాలుగు ట్యాంక్‌ల నిర్మాణం చేపట్టి 45 కిలో మీటర్ల పైపులైన్ ఏర్పాటు చేసి సుమారు 9వేల ఇళ్లకు ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ ఇచ్చి తాగునీరు సరఫరా చేస్తోంది. అయితే అధికారులు తాగునీటి సరఫరాలో ఒక విధానంగా నడుచుకుంటున్నట్లు పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రతి ఇంటికి మిషన్ భగీరథ నీటిని ఒకే సమయానికి కాకుండా కాలనీల వారీగా సమయపాలనతో సరఫరా చేస్తున్నట్లు చెబుతున్నారు. అయితే కొందరు నీళ్లు సరిపోని కారణంగా గేట్‌వాల్వ్ తొలగించి నేరుగా సంపులకు తరలిస్తుండగా.. మరికొందరు మాత్రం గేట్‌వాల్వ్ తొలగించి నిర్లక్ష్యంగా వదిలేయడంతో నీళ్లు వృథాగా పోతున్నాయని పలు కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి సరఫరా సమయం తక్కువగా ఉండటం వలన నీళ్లు సరిపోక ఇబ్బందులు పడుతుంటే మరికొన్ని చోట్ల రోడ్లపైన, డ్రైయినేజీల గుండా తాగు నీరు పారుతుండడం చూసిన పట్టణ ప్రజలు ఇదేం పద్ధతి అంటూ ఆగ్రహిస్తున్నారు. నీటి సరఫరా చేస్తున్న మున్సిపల్ సిబ్బంది సైతం పట్టించుకోకపోవడంపై స్థానికంగా పలు విమర్శలు వినిపిస్తున్నాయి. మున్సిపల్ అధికారులు పట్టించుకోవాలని పలువురు కోరుతున్నారు.



గేట్‌వాల్వ్ తొలగించడంతో వృథాగా పోతున్న నీరు

#### నల్లా నీరు వృథా చేస్తే చర్యలు



ఒక ఇంటికి రెండు కనెక్షన్లు తీసుకున్నట్లు తెలిసింది. మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ ఇచ్చిన సమయంలో ఏర్పాటు చేసిన గేట్‌వాల్వ్‌ను తిరిగి బిగించి నీరు వృథా కాకుండా చూడాలి. లేని పక్షంలో చర్యలు తీసుకుంటాం. ఏవరైనా నల్లా నీళ్లు వృథా చేసినట్లు సమాచారం అందింతే వారి కనెక్షన్ తొలిగించేందుకు కూడా వెనుకాడం.

– కె.సుష్మ, మున్సిపల్ కమిషనర్

**విద్యార్థినులకు సరిపడని తాగునీరు**

పట్టణంలోని బొడ్రాయి సమీపంలో గల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు మిషన్ భగీరథ నల్లా ద్వారా వచ్చే నీళ్లు సరిపడకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు అదే స్కూల్ ఎదుట నుంచి కొందరు గేట్‌వాల్వ్‌ను తెరిచి నిర్లక్ష్యంగా వదిలేస్తుండడంతో రోడ్డుపై తాగునీ ప్రవహిస్తోంది. గెట్‌వాల్వ్‌ను తెరిచి వదిలేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

### రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

వేలేరు / ఐనవోలు : కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందిన రైతులు ఈనెల 13లోగా రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని వేలేరు మండల వ్యవసాయ అధికారి కవిత, ఐనవోలు ఏఓ సునీల్ కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జూన్ 5 వరకు పట్టా పాస్‌బుక్ పొందిన రైతులు, అంతకుముందు బీమా చేసుకోని రైతులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ఫారం, పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్, తహసీల్దార్ మంజూరు చేసిన డీఎస్ పేపర్, ఆధార్‌కార్డుతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

### ఉచిత వైద్యశిబిరాన్ని వినియోగించుకోవాలి

ఆత్మకూరు : మండలంలోని అగ్రంపహాడ్ గ్రామంలో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ అధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆ సంస్థ నిర్వాహకుడు పల్లెపాడు దామోదర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య బృందం ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, కళ్లజోడు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు తరలిరావాలని, ఎలాంటి ఆరోగ్య సమస్య ఉన్నా వైద్యులకు తెలపాలని కోరారు. అవకాశాన్ని వినియోగించు కోవాలని ఆయన కోరారు.

### ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడికి గాయాలు

పరకాల : పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. బస్టాండ్‌లో పాప్‌కార్న్ విక్రయించే చాంద్‌పాషా రోడ్డు దాటుతుండగా హనుమకొండ నుంచి పరకాల బస్టాండ్ లోనికి వెళ్తున్న బస్సు ఢీకొట్టింది. దీంతో చాంద్‌పాషా తలకు బలమైన గాయం అవడంతో స్థానికులు 108కి సమాచారం అందించి స్థానిక సివిల్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హుటాహుటిన వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రి తరలించారు.

# నులిపురుగులను నివారిస్తే ఆరోగ్యం మెరుగు



ఎల్కతుర్తి : విద్యార్థికి నులిపురుగుల నివారణ మాత్ర మింగిస్తున్న డాక్టర్ రుబీనా



కమలాపూర్‌లో..



శాయంపేట : ఎంజేపీ పాఠశాలలో..



ఆత్మకూరు : మాట్లాడుతున్న డాక్టర్ స్వాతి



పరకాల : విద్యార్థికి మాత్ర మింగిస్తున్న ఎంపీడీఓ ఆంజనేయులు

ఎల్కతుర్తి : నులిపురుగులను నివారిస్తేనే చిన్నారుల ఆరోగ్యం మెరుగుపడుతుందని ఎంఈఓ సునీతారాణి, వంగర పీహెచ్‌సీ వైద్యురాలు రుబీనా అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం భీమదేవరపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, నులిపురుగుల నివారణ, వాటి లక్షణాలు, చికిత్స తదితర అంశాలపై అవగాహన కల్పించారు. డాక్టర్ రెహమాన్, హెల్త్ సూపర్‌వైజర్ మోహన్, ఏఎస్ఎం స్వరూప, ఆశ వర్కర్లు శ్యామల, స్వరూప ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

శాయంపేట : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేసినట్లు మండల వైద్యాధికారి సాయికృష్ణ తెలిపారు. ఎంజేపీ, సోషల్ వెల్ఫేర్, కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు మండలంలోని 36 ప్రభుత్వ పాఠశాలు, 6 ప్రైవేట్ పాఠశాలలు, 54 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ మాత్రలు పంపిణీ చేశామన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రెండేళ్ల నుంచి 19 ఏళ్ల మధ్య ఉన్న 4,682 మంది విద్యార్థులకు మాత్రలను తినిపించినట్లు చెప్పారు. ఒకే రోజు 91.08 శాతం మాత్రల పంపిణీ పూర్తి చేశామన్నారు. ఎంజేపీ ప్రిన్సిపాల్ రేవతి, హెల్త్ టీచర్ సరిత, లావణ్య, టీచర్ ప్రకాశ్, ఆశ వర్కర్ కవిత, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

కమలాపూర్ : నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా మిగించాలని ప్రభుత్వ వైద్యాధికారి నాగరాజు సూచించారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా కమలాపూర్, ఉప్పల్ పీహెచ్‌సీల ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని 1 నుంచి 19 ఏళ్ల లోపు విద్యార్థిని, విద్యార్థులకు ఎంపీడీఓ గుండె బాబు, ఎంఈఓ శ్రీధర్‌తో కలిసి మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమలాపూర్ పీహెచ్‌సీ పరిధిలో 9,294 మందికిగాను 8,848 మందికి, ఉప్పల్ పీహెచ్‌సీ పరిధిలో 875 మందికిగాను 795 మందికి మాత్రలు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఇప్పటికీ మాత్రలు తీసుకోనివారికి ఈనెల 18న పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. హెచ్ఈఓ రవీందర్, పీహెచ్ఎన్ లీల, హెల్త్ సూపర్‌వైజర్లు వెంకటరమణ, అమృత, టీబీ నోడల్ పర్సన్ ప్రభాకర్, పల్లె దవాఖానా వైద్యులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని మండల వైద్యాధికారి డాక్టర్ స్వాతి అన్నారు. తిరుమలగిరిలోని కేజీబీవీ పాఠశాలతో పాటు గుడెప్పాడ్‌లోని ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలలో సోమవారం నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నులిపురుగుల నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. విద్యార్థులు భోజనానికి ముందు భోజనం తర్వాత చేతులను శుభ్రం చేసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అన్నారు. ఎంఈఓ విజయ్‌కుమార్, ఎంజేపీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అనిత, గురుకుల సిబ్బంది అస్మా, చంద్రకళ, సూపర్‌వైజర్ సంపత్ పాల్గొన్నారు.

పరకాల : 19 సంవత్సరాల్లోపు బాల, బాలికలు తప్పనిసరిగా నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకోవాలని ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు సూచించారు. నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా పరకాల, నడికూడ మండలాల వైద్యాధికారి డాక్టర్ దివ్య ఆధ్వర్యంలో పరకాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం మాత్రలు పంపిణీ చేశారు. రెండో విడుతగా ఈనెల 18న కూడా నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. డాక్టర్ మాధవి, వైద్యసిబ్బంది రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలి



దుగ్గొండి : బీసీ రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో వెంటనే ఆమోదించాలని ఎంసీపీఐ(యూ) డివిజన్ కార్యదర్శి రాజా సాహెబ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని రేబల్లెలో సోమవారం ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజా సాహెబ్ మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ తెలంగాణ అసెంబ్లీ తీర్మాణం చేసి పంపితే కేంద్రం నాన్చివేత ధోరణి అవలంభిస్తోందని విమర్శించారు. గవర్నర్‌ను బిల్లు ఆమోదించకుండా ప్రభావితం చేస్తున్న బీజేపీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో గుణపాతం తప్పదన్నారు. బీసీల పట్ల కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే పార్లమెంటులో ఆమోదించాలని స్పష్టం చేశారు. నాయకులు బాబురావు, మహ్మద్ హుస్సేన్, కొమురయ్య, చేరాలు, ఐలోని, మేరుగు సుధాకర్, సిరిబొమ్మల భాస్కర్, లాసాని బాబురావు, రజబ్ అలీ, పాల్గొన్నారు.

## కాంప్లెక్ ఎరువుల వాడకాన్ని తగ్గించాలి

- ఆగ్రోనమిస్ట్ డాక్టర్ హరి

వర్ధన్నపేట : రైతులు కాంప్లెక్స్ ఎరువుల వాడకాన్ని తగ్గించాలని కోరమండల్ కంపెనీ ప్రతినిధి, ఆగ్రోనమిస్ట్ డాక్టర్ హరి సూచించారు. పట్టణంలో ఏరువాక రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన జనరల్ బాడీ సమావేశానికి ముఖ్యఅతిథులుగా డాక్టర్ హరి, కంపెనీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ మంజునాథ్ హాజరై మాట్లాడారు. డీఏపీ యూరియా, నానో యూరియా వాడాల్సిన పద్ధతులను వివరించారు. రాబోయే రోజుల్లో డీఏపీ, యూరియా ఉండవని చెప్పారు. నానో డీఏపీ, నానో యూరియా వాడకాలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. మొక్కకు కొద్దికొద్దిగా వేయాలని, ఒక్కసారికే పెద్ద మొత్తంలో వేయకూడదని తెలిపారు. రైతులు వ్యవసాయశాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం మేనేజింగ్ డైరెక్టర్ చొప్పరి సోమయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆళ్ల చిన్న కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.

## సీఈఐఆర్ టెక్నాలజీని వినియోగించుకోవాలి



వేలేరు : బాధితుడికి సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్సై సురేష్



శాయంపేట : బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగిస్తున్న హెడ్ కానిస్టేబుల్ రవీందర్

వేలేరు : దురదృష్టవశాత్తు సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితులు వెంటనే సీఈఐఆర్‌లో ఫిర్యాదు చేయాలని పోలీస్‌లు సూచించారు. మండలంలోని పీచర గ్రామానికి చెందిన శివరాత్రి కనుకయ్య కొన్ని రోజుల క్రితం సెల్‌ఫోన్ పొగొట్టుకున్నాడు. దీంతో ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ ద్వారా దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. పొగొట్టుకున్న ఫోన్‌ను ట్రెస్ చేసి స్వాధీనం చేసుకున్నారు. సోమవారం బాధితుడికి అప్పగించారు. ఈ సందర్భంగా కనుకయ్య స్థానిక పోలీసులకు కృతజ్ఞతలు తెలిపాడు.

శాయంపేట : మండల కేంద్రానికి చెందిన ముడతంపెల్లి గోవర్ధన్ సోమవారం పత్తిపాక మార్కెట్ ఏరియాలో సెల్‌ఫోన్ పోగోట్టుకున్నాడు. వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో గ్రామ పోలీస్ అధికారి, హెడ్‌కానిస్టేబుల్ రవీందర్ సీసీ కెమెరాల ఆధారంగా సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని బాధితుడికి అప్పగించారు.

## ఎన్నికల హామీలు నెరవేర్చాలి



మాట్లాడుతున్న రవీందర్

శాయంపేట : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు తెలంగాణ ఉద్యమకారులకిచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి రవీందర్ డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండలోని వేయి స్తంభాల గుడి నుంచి అమరవీరుల స్థూపం వరకు చేపట్టిన మహా పాదయాత్రలో మండలంలోని ఉద్యమకారులతో కలిసి ఆయన పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చాలని అన్నారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు మహేందర్, సురేష్, ప్రభాకర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## సీపీఐ మహాసభలను జయప్రదం చేయాలి

- జిల్లా సహాయ కార్యదర్శి భిక్షపతి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

శాయంపేట : ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్న సీపీఐ 4వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం భిక్షపతి మాట్లాడుతూ.. పేద ప్రజలకు న్యాయం కోసం పోరాడేది కమ్యూనిస్టు పార్టీనే అన్నారు. 100 సంవత్సరాల చరిత్రలో పేద ప్రజలకు అండగా నిలబడి ప్రజా సమ్యల పరిష్కారం కోసం నిరంతరం ఉద్యమించిందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బీసీ బిల్లును కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్‌లో ఆమోదించకుండా ద్వంద వైఖరి అవలంభిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే పార్లమెంట్‌లో బీసీ బిల్లును ఆమోదించాలని కోరారు. అలాగే 19 నుంచి 22 వరకు మేడ్చల్ జిల్లా గాజులరామారంలో నిర్వహించే రాష్ట్ర 4వ మహాసభలకు ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యుడు స్టాలిన్, మండల కార్యదర్శి సదానందం, మండల సహాయ కార్యదర్శి అశోక్, నాయకులు అంకూషావళీ, రమేశ్, సాంబయ్య, రాజు, కల్పన, లక్ష్మి పాల్గొన్నారు.

## 79ఫీట్ల జాతీయ జెండా ఆవిష్కరణకు ఏర్పాట్లు



జాతీయ జెండా ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి

ఎల్కతుర్తి : దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు స్వగ్రామమైన వంగరలో 79ఫీట్ల ఎత్తులో జాతీయ జెండా ఆవిష్కరణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కాజీపేట ఏసీపీ పింగిళి ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. జాతీయ జెండా ఏర్పాటుకు సంబంధించిన పనులను ఆయన సోమవారం పరిశీలించారు. వంగరలోని పీవీ రంగారావు బాలిక విద్యాలయంలో ఆగస్టు 15వ తేదీన 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని 79ఫీట్ల ఎత్తు, 9ఫీట్ల పొడవు, 12ఫీట్ల వెడల్పుతో జాతీయ జెండాను ఆవిష్కరించనున్నట్లు ఆయన వెల్లడించారు. దేశభక్తిని, జాతీయ సమాఖ్యతను చాటుకునేందుకు ఈ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. సీఐ పులి రమేశ్, ఎస్సైలు సాయిబాబు, ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

## గ్రీవెన్స్‌సెల్‌కు వినతుల వెల్లువ



ఐనవోలు : వినతిపత్రం అందజేస్తున్న రాజు



దామెర : వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఐనవోలు : మన ఊరు– మన బడి పథకంలో పూర్తిచేసిన పనులకు సంబంధించిన బిల్లులు చెల్లించాలని కోరుతూ అప్పటి విద్యా కమిటీ చైర్మన్ పొన్నాల రాజు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం హనుమకొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ.. మండలంలోని ఒంటిమామిడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో 2022 సంవత్సరంలో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పాఠశాల అభివృద్ధి పనులు చేపట్టానని తెలిపారు. పనులను పూర్తిచేయగా ఇంజినీరింగ్ విభాగం రికార్డు చేసి రూ.4,29,650 ఆగస్టు 2023, డిసంబర్ 2023లో ఆర్థికశాఖకు పంపించినట్లు చెప్పారు. రెండేళ్లు గడుస్తున్నా ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. అప్పులు చేసి పనులకు పూర్తిచేశానని, వడ్డీలు చెల్లించలేకపోతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక మరణిస్తే ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

**బీటీ రోడ్డు పనులు పూర్తిచేయాలి**

మండలంలో అసంపూర్తిగా ఉన్న ఆర్‌అండ్‌బీ బీటీ రోడ్డు పనులను వెంటనే పూర్తిచేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు మాదాసు ప్రణయ్ కోరారు. ఈ మేరకు సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో వినతిపత్రం అందించారు. కొండపర్తి నుంచి కొత్తపల్లి వరకు బీటీ రోడ్డు పనులను కాంట్రాక్టర్ మధ్యలోనే నిలిపివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వినతిలో పేర్కొన్నారు. ముల్కలగూడెం, ఒంటిమామిడిపల్లి ఎల్లమ్మ చెరువుకట్ట మీదుగా ఆర్‌అండ్‌బీ రోడ్డు పనులు కూడా నిలిచిపోయాయని తెలిపారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి రాజు, కార్యదర్శి విక్రమ్, భాస్కర్ తదితరులు ఉన్నారు.

**బస్‌షెల్టర్ నిర్మించాలి**

దామెర : మండల కేంద్రంలో బస్‌షెల్టర్ నిర్మించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గురిజాల శ్రీరామ్ రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో డీఆర్వో వైవీ గణేశ్‌కు వినతిపత్రం అందించారు. హనుమకొండ–దామెర–పరకాలకు బస్సు సర్వీసులు పెంచాలని, లాదెళ్ల, సింగరాజుపల్లి, వెంకటాపురం, పులుకుర్తి, గట్లకానిపర్తి, వెల్లంపల్లి, రాజీపేట గ్రామాలకు బస్సు నడిపించే విధంగా చర్యలు తీసుకోవాలని వినతిలో పేర్కొన్నారు.